**కథ**

# మాతృనిధి

**దొరవేటి**

**గుమ్మంలో శ్రీమతి చిరునవ్వు ఆహ్వానం చూసి ఆశ్చర్యపోయాడు మాధవరెడ్డి.**

**వచ్చింది తన యింటికేనో కాదోనన్న అనుమానం పీకుతూండగా మెల్లగా డ్రెస్ మార్చుకొని, కాళ్ళు కడుక్కొని అలసటగా సోఫాలో వాలాడో లేదో-**

**కాఫీ కప్పుతో ప్రత్యక్షం-శ్రీమతి-సావిత్రి.**

బిత్తరపోతూ కాఫీకప్పు అందుకున్నాడు రెడ్డి. ఏమిటీరోజు అర్ధాంగి సావిత్రిని తల దన్నే విధంగా ప్రవర్తిస్తోంది. ఆఫీసు నుండి అలసిపోయి వచ్చిన తనను పట్టించుకో కుండా పక్కింటి పల్లవితోనో, నట్టింటి టీవీ తోనో కాలక్షేపం చేస్తూ, అరచి గీపెట్టేదాకా ప్రతిస్పందించని అర్ధాంగలక్ష్మి ఈరోజు...ఇలా...

ఆలోచనల్తో సతమతమవుతూ కాఫీకప్పు నోటికం దించబోయాడు-

"ఏవండీ! మనింటికెళ్దామండీ..."

'ఇదేంటీ? దీనికి మెంటలా? ఇప్పుడున్నది మనింట్లో గాదా?' అని ఆశ్చర్యపోతూ ఆవిడ మొహం లోకి చూశాడు.

"అదేంటీ, అలా చూస్తారు? అదే నండీ...మనిల్లు..మన ఊళ్ళో..నందిగా మలో...అత్తయ్య..."

సంభాళించి పట్టుకోబట్టి సరిపోయిందిగానీ, కాఫీ కప్పు జారిపడిపోయేదే.

'ఇదేంటీ ఇన్ని షాకులిస్తోంది?' నోరు తెరచుకొని, కాఫీ తాగడం కూడా మరచి భార్యను చూడసాగాడు మాధవరెడ్డి.

"అట్లా ఆశ్చర్యపోతారేంటి? ముందు కాఫీ తాగండి. చల్లారిపోతుంది. చాలా విషయాలు మాట్లాడాలి" ఏదో పని ఉన్నట్టు కిచెన్‌లోకి వెళ్ళింది సావిత్రి.

మాధవరెడ్డి కాఫీ తాగడం పూర్తికాగానే తలుపు దగ్గ రగా వేసి "లోపలికి రండి!" అంటూ అతని చేయి పట్టుకొని బెడ్రూంలోకి తీసుకెళ్ళింది.

అలసటతో బెడ్‌మీద వాలాడు రెడ్డి. అతని కాళ్ళవద్దే కూర్చుంది ఆమె.

"రేపెళ్దామా నందిగామకి?" భర్త కళ్ళల్లోకి చూసింది.

"రేపేనా? రేపు..మంగళవారం..అష్టమి. పైగా వర్కింగ్ డే కదా!" వేళ్ళమీద అన్నీ లెక్కపెడుతూ అన్నాడు.

ఎప్పుడు ఊరికెళ్ళాలన్నా ఏదో వంకతో అడ్డుకోవ డమే సావిత్రికి తెలుసు. ఆ కళలో ఆమె తర్వాతనే ఎవరినైనా చెప్పుకోవాలి. తల్లితో తనకున్న అనుబం ధాన్ని నిర్దాక్షిణ్యంగా తుంచగలిగిన అతి సమర్థత ఆమెది. నందిగామ అన్నా, అత్తగారన్నా అంతెత్తునె గిరే సావిత్రి ఈ విపరీత ప్రవర్తన అతనికి అంతుచి క్కడం లేదు.

"హు! మనింటికి మనం వెళ్ళడానికి తిథులూ-వారాలూ చూస్తామా? ఇక ఆ బోడి ఆఫీ సుకు ఓ రెండ్రోజులు వెళ్ళకపోతే కొంపలేం అంటు కోవు" నందిగామ వెళ్ళడం ఎంత అత్యవసరమో ఆమె మాటలు చెప్పకనే చెబుతున్నాయి.

ఆమె మాటలు అతడ్ని ఆశ్చర్యంతోపాటు బాధకు లోను చేశాయి.

ఆఫీసు అతనికి దేవాలయం, వృత్తి దైవం; పని భగ వదర్చనగా భావించే మాధవరెడ్డి అంటే తోటివాళ్ళంద రికీ గౌరవం. 'ఉత్తమ ఉద్యోగి' అవార్డు ఇవ్వాల్సి వస్తే- ప్రతి సంవత్సరమూ అతనికే అది దక్కుతుంది. తన వృత్తినీ, వ్యవస్థనీ విమర్శించే వాళ్ళంటే అతనికి సరిపడదు. సావిత్రి స్థానంలో మరొకరుంటే మాంఛి క్లాసు పీకేవాడే.

"వెళ్దామండీ!" అతని ఆలోచనల్ని చెదరగొట్టింది ఆమె.

'అసలు దీనికి ఇంటికెళ్ళాలనే ఆలోచన రావడమే గొప్ప. ఈ వంకతో రెండు రోజులు అమ్మ వద్ద గడిపే అదృష్టమైతే లభిస్తుంది గదా. సూపరింటెండెంట్‌గా రికి ఫోన్ చేసి సెలవు సంగతి చెప్పొచ్చు' అను కుంటూ "ఇంతకూ పనేంటో?" అడిగాడు.

"అవన్నీ తర్వాత చెబుతా. మీరు ఊ అనండి" ఆమె అభ్యర్థన.

"ఊ!" అతని అంగీకారం.

★ ★ ★

హైదరాబాద్ నుండి పటాన్‌చెరువు వెళ్ళే బస్సులో కూర్చున్న తర్వాతగానీ అసలు సంగతి చెప్పలేదు సావిత్రి. ఆ సంగతి విన్నాక వెళ్ళకపోతే బాగుండునని పించింది మాధవరెడ్డికి.

అమ్మ...డెబ్బై ఒడిలో, ఇద్దరు కొడుకులున్నా, ఎవరూ దిక్కులేని దానిలా జీవితంతో ఒంటరిపో రాటం చేస్తూ, ఆ పల్లెటూళ్లో బతుకు వెళ్ళదీస్తోంది. ఏడాదికొకసారి చుట్టపు చూపుగా వెళ్ళి పలకరించి రావడం అదీ తనొక్కడే-పిల్లలిద్దరూ చదువుల పేరుతో, సావిత్రి అనారోగ్యం పేరుతో తప్పించుకుం టారు. అప్పుడైనా మొక్కుబడి చెల్లింపే తప్పితే, ఆ కన్నతల్లి మనసు పొరల్లోని చెమ్మను ఏనాడైనా తను అర్థం చేసుకున్నాడా?

అత్తగారంటే చెత్తబుట్టగా భావించే శ్రీమతి ఏదో ఒక విధంగా తను అనుకున్నదే సాధించి తీరడానికి అల వాటుపడింది. తను బలవంతంగా అమ్మను తమతో పాటు ఉంచుకున్నా, సూటి పోటి మాటల్తో ఆమె ఆత్మాభిమానానికి తూట్లు పొడిచింది. అభిమానవం తురాలైన అమ్మ బతికున్నన్ని రోజులూ స్వతంత్రంగా తన ఇంటనే ఉంటానని, ఏ కొడుకు ఇంటికీ వెళ్ళనని శపథం చేసేలా ప్రేరేపించింది.

ఆ పల్లెటూళ్ళో అమ్మ ఏ పూట తింటుందో? ఎట్లా తలదాచుకుంటుందో? ఆరోగ్యమెట్లా ఉంటుందో? తాతలనాటి ఇల్లు. సేద్యానికి అంతగా పనికిరాని పదె కరాల పొలం. వానలు బాగా పడితే ఏవో నాలుగు గింజలు పండుతాయి. ఎంత కష్టమున్నా, ఎవ్వరినీ నోరు తెరిచి అడగని అభిమానవంతురాలు ఆమె. తను గానీ, తమ్ముడుగానీ ఏనాడూ పట్టించుకోలేదు. కూతవేటు దూరంలోని హైదరాబాద్‌లోని తన పరి స్థితే ఇట్లా ఉంటే, ఎక్కడో బెంగుళూరులో ఉండేవాడి గురించి చెప్పేదేముంటుంది?


ఇటువంటి పరిస్థితుల్లో అమ్మను చూడటానికె ళ్తున్నాం. కాదు కాదు. ఆ మాటంటే ఆత్మవంచనే అవుతుంది. ఆ వంకతో లక్షల ఆస్తిని సొంతం చేసుకో వాలనే దురాశతో వెళ్తున్నాం. హఠాత్తుగా సంక్రమించ బోయే ఈ ఆస్తి రియలెస్టేట్ పుణ్యం.

హైదరాబాద్ చుట్టూ యాభై కిలోమీటర్లు దాటి శర వేగంగా దూసుకుపోతున్న ఈ వ్యాపారం పటాన్ చెరువుకు దగ్గరదాకా ఎప్పుడో వచ్చింది. మెయిన్‌రోడ్ దాటి పక్కదార్లలోకీ విస్తరించింది. పటాన్ చెరువుకి పట్టుమని పది కిలోమీటర్లైనా లేదు తమ ఊరు. ఆ ఊరికి దగ్గర్లో ఓ మార్వాడీ ఫాం హౌజ్ ఏర్పాటు చేసు కున్నాడు. అక్కడికి అడ్డంగా ఉన్న పొలాలను కొని రోడ్డు వేసుకుంటున్నాడు. ఆ పొలాల్లో తమ పొలం కూడా ఉండటం ఈ యోగానికి కారణం. ఈ సమా చారమంతా ఊళ్ళోని ఓ శ్రేయోభిలాషి ద్వారా సావి

త్రికి చేరింది. అతనే తమ్ముడు కేశవరెడ్డికీ తెలియజేశాడట. ఇదీ ఈ హఠాత్ ప్రయాణానికి, అత్తపట్ల కోడలి అభిమానానికీ నేపథ్యం.

గవ్వకు పనికి రాదనుకొని, అసలు ఆ పొలం ఉనికినే మరచిపోయిన వేళ లక్షలు గుమ్మరిస్తూందంటే సావిత్రి ఆలోచనా సరళి మారడంలో ఆశ్చర్యం లేదు. కాని, అమ్మను ఆదరించని మాకు ఆస్తిని అనుభవించే హక్కెక్కడిది? పైగా అది పూర్తిగా అమ్మ ఆస్తే. తమ చిన్నప్పుడే నాన్న చనిపోతే మాతామహులు అమ్మకు రాసిచ్చిన పొలం. దానిమీద సర్వహక్కులూ అమ్మవే.

★ ★ ★



మాధవరెడ్డి ఊహించినట్లే నందిగామలో రకరకాల అనుభవాలు అతడ్ని చుట్టుముట్టాయి.

అమృతం వంటి అమ్మ ప్రేమలో ఏ కల్మషమూ లేదు. కానీ, ఆమె చూపులో 'అమ్మకంటే ఆస్తే గొప్పది కదరా?' అన్న ప్రశ్న తాండవించినట్టనిపించింది.

ఆరోజు రాత్రే తమ్ముడు కేశవరెడ్డి కూడా రెక్కలు కట్టుకొని వచ్చివాలాడు.

చుట్టుపక్కల అమ్మలక్కలంతా- "ఏం నాయనా! ఇన్నేండ్లు మీ యమ్మ గుర్తుకు రాలేదుగానీ, ఇయ్యాళ్ళ పైసలు జూసేటళ్ళకు ప్రేమ పుట్టుకొచ్చినాది?" అంటూ మొహమ్మీదనే అనేశారు.

"అయితే మాత్రం, కన్నతల్లి ఆస్తిని ఏటిపాలు జేసుకుంటారా? వాళ్ళ ఆస్తి కోసురం వాళ్ళొచ్చిన్రు. తప్పేమున్నది?" అంటూ మగపురుషులు సమర్థించారు కూడా.

వాళ్ళను పిలిపించిన మధ్యవర్తి సదరు యాదగిరి రహస్య సమావేశం ఏర్పాటు చేసి విషయమంతా చెప్పాడు.

"సూడుండ్రి రెడ్డిసాబ్! పుణ్యానికి పైసలొస్తున్నాయంటే ఎక్కడలేనోడు గూడ తయారైతడు. మీరు ఏమాత్రం లాపర్వా జేసినా ఈ ఆస్తి మీకు గాకుండా పోతది. మూడు రోజులకింద మీ మేనమామ కొడుకు నర్సిరెడ్డి వొచ్చి, 'ఆ భూమి మాది. మా తాత మా యత్తకు బతుకనీకె రాసిచ్చిండు. ఆమె బతికున్నంతకాలం మంచి చెడ్డ నేనే జూసుకుంట. కొడుకులు యాడున్నరు? కాయిదాలు గూడ నా పక్షాన్నే ఉన్నయ్. కాదంటె కోర్టుకు పోత! ముసల్దిఎక్కువ నకరాల్ జేస్తే, ఆయింత గొంతు పిసికి, పోలీసులకింత మేత పడేస్తే అయిపాయె. ఎవ్వడడ్డమొస్తడో సూస్త..' అయిల్ ఫయిల్ మాట్లాడిపొయ్యిండు. భూమి మీయమ్మ పేరునున్నది. మిమ్ములను గాదనేటోడెవ్వడు? ఆమె ఒంటిగా ఉంటున్నదంటాని ఎవ్వడన్నా భయపెట్టి, బెదిరిచ్చి, ధంకీలియ్యనీకె జూస్తరు. వాడు ఆ జీతూ సేఠ్‌ను గూడ గలిస్తే తిట్టి పంపించిండంట. అది వేరే సంగతనుకోండి. రేపు ఆ సేఠ్ వస్తడు. కలిసి అన్ని మాట్లాడదం. మీరు దూరాన ఉంటరు. ఎట్ల వొచ్చినోళ్ళు వొచ్చిన్రు. ఒక రోజు ఎనుకా ముందైనా పని పూర్తి జేసుకొనేపొండ్రి.." అంటూ ఉచితమైన సలహాలిచ్చి, తను ఇంతగా కష్టపడుతున్నందుకు ఎంత చెల్లించాలో కూడా చెప్పాడు-కొసమెరుపులా.

మాధవరెడ్డి, కేశవరెడ్డి కూడా అతని ప్రతిపాదనను కాదనలేదు. నగరాల్లో అయితే రియలెస్టేట్ వ్యాపారులు అంతకు పదిరెట్లు లాగుతారు.

యాదగిరి చెప్పినట్టే మరుసటిరోజు జీతూ సేఠ్ వచ్చాడు వెంట ఒక లాయరును తీసుకొని. అతను కండిషన్స్ చెప్పాడు. లెక్కలు చేశారు. ఎనభై లక్షల ఇరవై ఆరువేలు అయ్యింది. ఈ వ్యవహారం ఒక పక్క సాగుతూండగానే నర్సిరెడ్డి నలుగురిని వెంటబెట్టుకొచ్చి ధూం-ధాం చేయబోయాడు. కేశవరెడ్డి మంచి మాటలతోనే అతనికేదో సర్ది చెప్పి పంపిం

చాడు. తర్వాత యాదగిరిని కూడా అడిగిన కమీషన్‌తో సంతృప్తి పరచారు. పదిరోజుల్లో డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేట్టు ఒప్పందం చేసుకున్నారు. కేశవరెడ్డికి మళ్ళీ రావడం కష్టమవుతుందని మరుసటిరోజే పత్రాలు సిద్ధం చేయించి అతని సంతకాలు తీసుకున్నారు. `బిడ్డలిద్దరూ బయలుదేరి వెళ్తూంటే చేరబిలిచింది తల్లి వజ్రమ్మ.

"నాయనా మధూ! కేశా! ఏ కారణంగా అయితేనేం, మీరు నా వొద్దకొచ్చిన్రు. మూడు రోజులు నా కండ్లముందరున్నరు. నాకంతే జాలు. నేను బతికుండంగ మల్ల వొస్తరో రారో..."

ఆమె కళ్ళలో హఠాత్తుగా నీళ్ళు. కొడుకుల గుండె పొరల్లో తడి..

"కాని, వొచ్చే పండుగకు పిల్లలందరినీ దీసుకొని రాండి..ఒక్కసారి జూపిచ్చుకొని తీసుకపోండి.." ఆమె కంఠం గంభీరంగా మారింది.

"నేను రాగి ఆకులాగా రాలిపోవాలనుకునేదాన్నే గాని, ఈత జెగ్గలాగ పట్టుకొని యాలాడే దాన్ని గాను. కాలు జేయి సక్కంగుండంగనే ఆ దేవుడు నన్ను దీసుకపోవాలె. మీరు మాత్రం మీ కష్టాన్నే నమ్ముకోండి బిడ్డా! మీది గాని దాని గురించి ఆశ పెట్టుకోకుండ్రి..సల్లగ బతుకుండి నాయనా!" మనసారా ఆశీర్వదించి పంపింది.

* * *

ఆ తల్లి వాక్కు నిజమైంది. ఆరు నెల్లు తిరక్కుండానే అమరలోకం చేరింది. కొడుకులు కూడా అంతకుముందు పండుగకు పిల్లాపాపలతో ఆమె కళ్ళ ముందు తిరిగి ఆమెను తృప్తి పరచారు. కోడళ్ళూ ఎన్నడూ లేని విధంగా ఎంతో ప్రేమాదరాలు పంచారు.

ఆమె అంతిమయాత్రలో ఊరు ఊరంతా పాల్గొన్నది. తల్లి మంచితనాన్నీ, గుణగణాలనూ, ఆమెపడ్డ కష్టాలనూ వచ్చిన వాళ్ళంతా తలచుకుంటూంటే మాధవరెడ్డి గుండె చెరువయ్యింది. పసిపిల్లాడిలా వెక్కెక్కి ఏడ్చాడు. కేశవరెడ్డి అమ్మను సరిగ్గా చూసుకోలేని తన అశక్తతకు సిగ్గుపడ్డాడు. కోడళ్ళూ తాము పొరబాటు చేశామేమో అనుకున్నారు. మనవండ్రు, మనవరాళ్ళకీ వాళ్ళ తల్లిదండ్రులపై తేలికభావం ఏర్పడింది.

వజ్రమ్మ చనిపోయిన 14వ రోజు ఆమె ఆస్తి విషయమై సమావేశమయ్యారు మాధవరెడ్డి-సావిత్రి; కేశవరెడ్డి-శ్రీదేవి. తల్లి బతికున్నన్ని రోజులూ ఆ ఆస్తి పట్ల వాళ్ళకే అధికారం చెల్లదని ముందే రాయించి ఉండటాన, అన్ని రోజులూ ఓర్మి వహించక తప్పలేదు.

లాయర్ వచ్చాడు. నలుగురు పెద్దమనుషులూ పిలిపించబడ్డారు.

ఆస్తిపంపకం ఏ గొడవా లేకుండా హుందాగా జరగాలని, పరస్పరం అందుకు సహకరించుకోవాలని అన్నదమ్ములు ముందే అంగీకారానికి వచ్చినందువల్ల, తల్లి అభిప్రాయం ప్రకారమే అన్నీ జరిపేందుకు తమ ఆమోదాన్ని తెలిపారు మాధవ, కేశవులు.

అందరూ వింటూండగా లాయర్ వీలునామా చదివాడు.

"నా ఇద్దరు కొడుకులూ నా రెండు కళ్ళలాంటి వాళ్ళే. వాళ్ళకు నా ఆస్తి సమానంగా పంచాలి. కాని, నేను తీసుకొచ్చిన ఆస్తి ఏదైనా ఉంటే అది వాళ్ళకు ముందే ఇచ్చేశాను. అది మంచితనం గావచ్చు, గుణంగావచ్చు, మరేదైనా కావచ్చు. వాళ్ళ చదువుకు ఏనాడూ- ఏ లోటూ రాకుండా చూసుకున్నాను. ఇప్పుడు వాళ్ళు తమకాళ్ళమీద తాము నిలబడటమే కాక పదిమందికీ ఆధారం ఇవ్వగలిగే స్థితిలో ఉన్నారు. అందుకే ఈ ఆస్తి వాళ్ళకు అవసరం లేదు."

ఉలిక్కిపడ్డారంతా. లాయర్ కొనసాగించాడు.

"నేనుంటున్న ఇంట్లో వాళ్ళుండలేరు. అందుకే నేను బతికున్నన్నాళ్ళు నాకు తోడుగా ఉన్న పర్మయ్య కుటుంబానికి అది చెందుతుంది. ఇక డబ్బు... ఈ ధనం వృధా కావడానికి వీల్లేదు.

ఈ డబ్బు 'మాతృనిధి' పేరుతో ఒక జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేసి, దానిమీద వచ్చే వడ్డీ- ప్రతి సంవత్సరం ఓ అనాథతల్లికి-అంటే బిడ్డలు లేకున్నా, ఉన్నా పట్టించుకోకుండా దిక్కులేని బతుకు బతుకుతున్న అమ్మలకు చెందేటట్లు చేయండి. నా పెద్దకొడుకు మాధవరెడ్డి ఈ పనికి తగినవాడని నా నమ్మకం. అతనొప్పుకోకపోతే ఈ కింది వాళ్ళు ధర్మకర్తలుగా వ్యవహరిస్తారు.."

"నో!" హిస్టీరిక్‌గా అరిచారు సావిత్రి, కేశవరెడ్డి, శ్రీదేవి.

గంటసేపు నానా గొడవ జరిగింది. లాయరు మీద విరుచుకుపడ్డారు. అమాయకులైన పర్మయ్య కుటుంబాన్ని నానా దుర్భాషలాడారు.

"పదండి! ఇంకా ఏం మొహం పెట్టుకొని ఇక్కడ కూర్చున్నారు. అది తల్లికాదు, మీరు కొడుకులు గారు. ఇంతకూ మిమ్మల్ని అది మీ తండ్రికే గన్న..."

"షటప్!" సావిత్రి చెంప ఛెళ్ళుమంది. మాధవరెడ్డి దాదాపు అరచినట్టే అన్నాడు. "మీకంతా డబ్బు పిచ్చి పట్టింది. మా అమ్మ ఆలోచించిందాంట్లో అవగింజంతైనా తప్పు లేదు. ఆమె నిర్ణయాన్ని తు.చ. తప్పకుండా నేను పాటిస్తాను. నా తల్లిలా దిక్కులేని జీవితం గడపకుండా కొంతమంది తల్లులకైనా సాయపడ్తాను. మా అమ్మ ఆత్మకు శాంతి చేకూరుస్తాను" ధారాపాతంగా వర్షిస్తున్నాయి - అతని కళ్ళు.

# అలరించే కథనం

**సినిమాలు సృజనాత్మకతకి చిరునామాగా ఉండాలి. కొత్తదనం కొట్టొచ్చినట్టు ఉంటే ఆ చిత్రాలు బాక్సాఫీస్‌ని బద్ధలుకొట్టి కొత్త రికార్డులకి నాంది పలుకుతాయి. రాజ్‌కుమార్ సంతోషి కొత్త చిత్రం అన్ని తరగతుల్నీ అలరించగలదంటోంది భూమిక చావ్లా. 'ఫ్యామిలీ' అని పేరు పెట్టిన ఈ చిత్రం చక్కని కుటుంబ కథా చిత్రం అవుతుందంటోంది ఈ భామ. అమితాబ్‌బచ్చన్, అక్షయ్‌కుమార్‌లు ఇందులో నటించారు. ఈ సినిమా తర్వాతైనా భూమిక బిజీ అవుతుందేమో చూద్దాం.**

